ప్రజాశక్తి

సోమవారం 7 ఏప్రిల్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పసిప్రాణం కుక్కలపాలు

- అధికారుల నిర్లక్ష్యానికి బాలుడి ప్రాణం బలి
- స్వర్ణభారతి నగర్‌లో రెండో ఘటన
- గుంటూరులో మొక్కుబడిగా కుక్కల నియంత్రణ

జిజిహెచ్‌లో బాలుని మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి ఆదివారం ఒక బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక స్వర్ణభారతి నగర్‌లో చర్చికి వెళ్లి ఇంటికి వెళ్తుండగా కుక్క దాడి చేయగా బాలుడు ఐజాక్ (4) ప్రాణాలు కోల్పోవడం గుంటూరులో కలకలం రేపింది. కుక్కల బెడద ఎక్కువగా ఉందని తాను స్వయంగా అసెంబ్లీలో మాట్లాడినా అధికారులు చర్యలు తీసుకోలేదని టిడిపి ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. కుక్కల బెడదపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించిన తర్వాత కూడా రాష్ట్ర ఉన్నతాధికారులు గుంటూరునగర పాలక సంస్థకు ఇంత వరకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. శాసన సభలో సభ్యులు మాట్లాడిన అంశాలను నమోదు చేసుకుని తగిన చర్యలు తీసుకోవాల్సిన వివిధ శాఖల ఉన్నతాధికారులు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని పలువురు ఎమ్మెల్యేలు వాపోతున్నారు. స్వర్ణభారతి నగర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవనేని కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు. అయితే ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఇదిలా ఉండగా గుంటూరు నగర పాలక సంస్థలో కుక్కల నియంత్రణకు వినియోగిస్తున్న నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం అవుతున్నాయని పలుమార్లు కార్పొరేటర్లు స్వయంగా కౌన్సిల్ సమావేశాలో ప్రస్తావించారు. అయినా కొన్నేళ్లుగా చర్యల్లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతేడాది జూన్ నుంచి కుక్కలను పట్టుకుని ఆపరేషన్ చేసే ప్రక్రియను ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించారు. కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్ర ▶ 2లో

వీనుల విందుగా నాటికలు

- యడ్లపాడులో ముగిసిన సుందరయ్య కళానిలయం నాటిక పోటీలు
- మూడ్రోజులపాటు కోలాహలంగా ప్రదర్శనలకు తరలివచ్చిన ప్రేక్షకులు
- పలు విభాగాల్లో బహుమతులు ప్రదానం

నాటికలకు నీరాజనంగా వచ్చిన ప్రేక్షకులు

బర్డ్‌ఫ్లూ కలకలం నేపథ్యంలో తనిఖీలు

మాసం దుకాణాలు, హోటళ్లలో అహార తనిఖీ అధికారుల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బర్డ్‌ఫ్లూ కలకలం నేపథ్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా మాసం దుకాణాలు, హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో ఆహార భద్రత అధికారు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని దుకాణాలనూ జిల్లా ఆహార భద్రత అధికారి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్వర్యంలో తనిఖీ చేశారు. మాసం విక్రయాలు, ఆయా దుకాణాల నుండి వ్యర్థాల తరలింపు, హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో ఆహార పదార్థాల తయారీపై వివరాలు సేకరించి పరిశీలించారు. నిర్వాహకులకు లక్ష్మీనారాయణ పలు సూచనలు చేశారు. మాంసాన్ని ఎక్కడ కొంటున్నారు? మిగిలిన మాంసాహర పదార్థాలు ఏమైనా నిల్వ చేస్తున్నారా? అని ఆరా తీశారు. మాంసం దుకాణదారులు కోళ్లు, మేకలు ఆరోగ్యంగా ఉన్న వాటినే విక్రయించాలని, కోయడానికి ఉపయోగించే పరికరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. శుభ్రత పాటించక పోయినా, మిగిలిన మాంసం నిల్వలను ఫ్రిడ్జ్‌లో ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా తనిఖీల్లో ఎక్కడా ఆహార పదార్థాలను నిల్వ ఉంచిన దాఖలాలు లేవని అన్నారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జి.రామకోటయ్య, పి.రమాదేవి, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

అనామకుల్లా రాజధాని కార్మికులు

పెరిగిన అద్దెల భారంతో బస కోసం బస్టాండ్, సత్రాల్లో అవస్థలు

తుళ్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నేలపై దోమతెర కట్టుకొని నిద్రిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో భూమి ధరలే కాదు, ఇంటి అద్దెలు కూడా భారీగా పెరిగాయి. చిన్న ఇల్లు కావాలన్నా అద్దె రూ.10 వేలు పైమాటే. డబుల్ బెడ్ రూముకు రూ.15 వేలకు పైమాటే. తుళ్లూరు ప్రాంతాన్ని ప్రభుత్వం రాజధానిగా ప్రకటించాక భూముల ధరలు పెరిగాయి. దాంతో కొంతమంది తమకున్న భూముల్లో కొన్నెకరాలు అమ్ముకుని భారీ భవనాలు నిర్మించారు. ఇళ్లను ఆదాయ మార్గంగా భావించి ఖర్చుకు వెనుకాడకుండా అన్ని వసతులతో నిర్మించారు. ఇతర ప్రాంతాల నుంచి కార్మికులు, ఉద్యోగులు, ఇతరులు పెద్ద సంఖ్యలో రాజధానికి వస్తారని, ఇళ్లకు బాగా గిరాకీ ఉంటుందని ఆశపడ్డారు. అయితే 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయి వైసిపి అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణాన్ని పట్టించుకోక పోవడంతో ఇళ్ల యజమానులకు కష్టాలు మొదలయ్యాయి. కొత్త వారు అద్దెలకు రాకపోగా అప్పటివరకు ఉన్న కొద్దిమంది కూడా ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. దీంతో వైసిపి ఐదేళ్ల పాలనలో చాలా భవనాలకు 'టూ లెట్' బోర్డులు దర్శనమిచ్చాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ▶ 2లో

రాజధాని ప్రాంతం తుళ్లూరులో కార్మికుల కోసం నిర్మితమవుతున్న షెడ్డులు

13న మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి సమీపంలో చిన్న కాకానిలోని యార్లగడ్డ వెంకన్న చౌదరి ఆంకాలజీ లివింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రాంగణంలో 100 పడకల ఆస్పత్రికి ఈ నెల 13న శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్ ఎన్నికల హామీ మేరకు ఈ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఆధునిక వసతులతో వంద పడలక ఆస్పత్రి నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరి ప్రాంతంలో పేద మధ్యతరగతి ప్రజలకు ఈ వంద పడకల ఆస్పత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 13వ తేదీ ఉదయం 9 గంటలకు మంత్రి నారా లోకేష్ ఇక్కడ భూమి పూజ నిర్వహిస్తారని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అభివృద్ధి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. యార్లగడ్డ వెంకన్న చౌదరి ఆంకాలజీ లివింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ (అప్పుడు క్యాన్సర్ ఆస్పత్రి)కి ఆనాడు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆయన మనవడు నారా లోకేష్ మంత్రిగా శంకుస్థాపన చేయడం విశేషం.

గుంటూరులో శ్రీరామనవమి శోభాయాత్ర

ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ హాజరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శ్రీరామ నవమిని పురష్కరించుకుని గుంటూరు బృందావనం గార్డెన్స్ నుంచి ఆర్ అగ్రహారం శ్రీరామ నామ క్షేత్రం వరకు పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర ర్యాలీ జరిగింది. ఈ యాత్రలో స్థానిక మహమ్మద్ నజీర్ అహ్మద్, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎక్కడికి అక్కడ మజ్జిగ వాటర్ ఏర్పాటు చేశారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ప్రారంభమై పురవీధుల్లో ఊరేగించుకుంటు శోభయాత్ర బ్రాడీపేట, అరండల్ పేట, శంకర్ విలాస్, నాజ్ సెంటర్, జిన్నాటవర్, ఎన్టీఆర్ బస్టాండ్, లాలాపేట వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం మీదగా రామనామ క్షేత్రం వరకు శోభాయాత్రను కొనసాగించారు.ర్యాలీలో వస్తున్న వారికి మహమ్మద్ నజీర్ అహ్మద్, స్వయంగా మజ్జిగ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.

12న గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్

ప్రజాశక్తి-గుంటూరు

అరుణాచలంలో ఏప్రియల్ 12వ తేదీన, పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షిణ మహోత్సవాలకు గుంటూరు-2 ఆర్టీసి డిపో నుండి స్పెషల్ హైటెక్ పుష్‌బ్యాక్ బస్ ఏర్పాటు చేశామని డిపోమేనేజర్ షేక్.అబ్దుల్‌సలామ్ ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈబస్ ఏప్రియల్ 10న రాత్రి 9.15 గంటలకు గుంటూరులో బయలుదేరి, 11న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడ నుండి బయలుదేరి పౌర్ణమిరోజు ఏప్రియల్ 12న ఉదయం అరుణాచలం చేరుకుంటుందని అన్నారు. అదే రోజు అరుణాచలేశ్వరుని దర్శించుకొని, 12న అరుణాచలంలో బయలుదేరి, ఏప్రియల్ 13న ఉదయం 6:30 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలియజేశారు. 96164 నెంబర్ ద్వారా ఆన్లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పరిసర ప్రాంత ప్రయాణికులు ప్రయాణీకులు వినియోగించుకోవాలని, ఒక్కోటికెట్ ధర 2420లు మాత్రమేనని తెలిపారు. అదనపు సమాచారం కోసం 7382894613, 7382896403 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పసిప్రాణం కుక్కలపాలు

(మొదటి పేజీ తరువాయి)

చికిత్సలు చేయకుండానే చేసినట్టు రికార్డు చేసి నిధులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది జూన్ నుంచి డిసెంబరు వరకు నాలుగు వేల కుక్కలను పట్టుకుని వాక్సిన్ వేసినట్టు రికార్డులో కనిపిస్తున్నా వాటికి ట్యాగ్ వేసి నిధులు స్వాహా చేసినట్టు పలువురు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. శస్త్ర చికిత్సలు చేసే విషయంలో పర్యవేక్షణ లేదు. ఈ అంశంపై పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినా అధికారులు మొక్కుబడి సమాచారం చెప్పడం, జంతు ప్రేమికులు అడ్డుకుంటున్నారని దాట వేయడం తప్ప ప్రజల ప్రాణాల గురించి పట్టించుకోవడం లేదు. జంతు ప్రేమికులతో జిల్లా కలెక్టర్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోవాలో ఇంత వరకు ఏ ఒక్క కమిషనర్ పట్టించుకున్న దాఖలాలు లేవు.

గుంటూరునగర పాలక సంస్థలో 19 వేల కుక్కలు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. స్వర్ణ భారతి నగర్‌లో 2017లో కూడా కుక్కల దాడిలో ఒక బాలుడు మృతి చెందాడు. ఆదివారం కూడా ఇదే ప్రాంతంలో కుక్క దాడి చేసి బాలుడు చనిపోయాడు. పేదలు ఎక్కువగా నివశించే ఈ ప్రాంతంపై నగర పాలక సంస్థ అధికారుల పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి.

రోదనలతో నిండిన ఆస్పత్రి ప్రాంగణం

స్వర్ణభారతి నగర్‌లో నివాసం ఉండే కూలీలైన నాగరాజు, రాణి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా చివరి కుమారుడైన ఐజాక్ కుక్కల దాడిలో మృతి చెందడంతో ఆస్పత్రితో బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ కొడుకు నిండు ప్రాణాలూ బలయ్యాయని మృతుని తల్లిదండ్రులు ఆక్రోశానికి గురవయ్యారు.

బాలుడి మృతి బాధాకరం : గళ్లా మాధవి

బాలుని మృతిపై ఎమ్మెల్యే గళ్లా మాధవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల శోకం తీర్చలేనిదని, కుక్కల బెడదపై తాను అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినప్పుడు అధికారులు తాత్కాలికంగా చర్యలు తీసుకోవటం తప్ప సీరియస్‌గా స్పందించ లేదని అన్నారు. తప్పు ఎక్కడ జరిగినా నేడు ఓ నిండు ప్రాణం బలైపోయిందన్నారు. ఇకనైనా అధికారులు వీధి కుక్కల మీద దృష్టి సారించాలని కోరారు.

కమిషనర్, జెసితో మాట్లాడిన మంత్రి నారాయణ

బాలుని మృతిపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ విచారం వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలపై జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ తేజ, కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మంత్రి ఆదేశాలతో గుంటూరు జిజిహెచ్‌లో మృతుని తల్లిదండ్రులను కమిషనర్ శ్రీనివాసులు. పరామర్శించారు.

అనామకుల్లా రాజధాని కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని గ్రామాల్లో అద్దెలు అనూహ్యంగా పెరిగాయి. చిన్న రేకుల షెడ్డు కావాలన్నా రూ.5 వేలు అంటుండడంతో రోజువారీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నిర్మాణ సంస్థలు తమ వద్ద పనిచేసే కార్మికుల కోసం షెడ్డులు నిర్మిస్తున్నారు. తుళ్లూరులోని అయ్యన్న చెరువు కాలనీకి సమీపంలో ప్రధాన రహదారి పక్కన కొంతకాలంగా షెడ్డుల నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ కార్మికుల కోసం 30కి పైగా షెడ్డులను నిర్మిస్తున్నారు. ఇప్పటికే రోజువారీ కూలి పనులకు వచ్చిన కార్మికులు మాత్రం ఇళ్ల అద్దెలు కట్టలేక రాత్రి వేళల్లో బస్టాండ్‌లు, సత్రాల్లో తలదాచుకుంటున్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు కట్టుకొని నేలపై నిద్రిస్తున్నారు. రాజధాని నిర్మాణ పనులు మొదలైతే కార్మికులు పెద్ద సంఖ్యలో రాజధానికి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్మికులందరికీ వసతి, భద్రత, ఆరోగ్యం తదితర సౌకర్యాలను ప్రభుత్వం ఏ మేరకు కల్పించ గలుగుతుందనే సందేశాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు

సిఆర్‌డిఎ రూటే సెపరేటు

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరంలో అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకునే అధికారి కరువయ్యాడు. సిఆర్‌డిఏ రూటే సపరేటు అన్న మాట వినిపిస్తుంది. ప్రస్తుతం 50 కి పైగా అపార్ట్మెంట్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో అధిక శాతం అపార్ట్మెంట్లకు సి ఆర్ డిఏనుంచి పూర్తిస్థాయిలో అనుమతులు లేవని తెలుస్తోంది. తూతూ మంత్రంగా అనుమ తులు తీసుకొని, హడావుడిగా అపార్ట్మెంట్ నిర్మాణం చేపట్టి, వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆపార్ట్మెంట్ల నిర్మాణంలో సిఆర్డిఎ అధికారులను సైతం బురిడీ కొట్టించి నిర్మాణాలు సాగిస్తున్నారు. గన్నవరం విద్యా నగర్లో ఇదే మాదిరిగా ఒక అపార్ట్మెంట్ నిర్మా ణం జరిగింది. జి ప్లస్ టు కి అనుమతి తీసు కొని 8 అంతస్తులు నిర్మించారు. 24 అడు గులు ఉన్న రహదారిని 30 అడుగులుగా చూపించి అధికారులను మాయ చేశారు. ఇదే మాదిరిగా జాతీయ రహదారికి అనుకుని ఇటీ వల నిర్మించిన మూడంతస్తుల భవనానికి సి ఆర్ డి అనుమతులు లేవు. మరో భవన యజ మాని సెలవు దినాల్లో, అర్ధరాత్రి వేళల్లో మూడంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఏ అపార్ట్మెంట్ చూసినా సి ఆర్ డి ఏ నిబంధనలను గాలికి వదిలేసినట్లే కనిపిస్తుం ది. రహదారులు సరిగ్గా లేకపోవడం, నిర్మిం చిన అన్ని అంతస్తులకు అనుమతులు లేకపోవటం, పచ్చదనాన్ని పట్టించుకోకపోవ డం. సి ఆర్ డి ఎ అనుమతులను పూర్తిస్థాయి లో పాటించకపోవడం కనిపిస్తున్నాయి.గన్నవరం ప్రాంతంలో సీఆర్డీఏ నిబంధ నలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న అపార్ట్మెంట్లకు పంచాయతీ అధికారి నుంచి పూర్తి సహకారం అందు తుందని విమర్శలు ఉన్నాయి. అనుమతుల సమయంలోనే పంచాయతీ కార్యదర్శిని ప్రసన్నం చేసుకొని యజమానులు అక్రమ నిర్మాణాలకు తెరతీసి నట్లు తెలుస్తోంది. సి ఆర్ డి ఏ నిబంధన ప్రకారం 30 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉంది కానీ 15.. 20 అడుగులు ఉన్నా అనుమతులు ఎలా లభిస్తున్నాయి అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం ?

గన్నవరం ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సి ఆర్ డి ఏ అధికారులు దష్టి పెట్టిన దాఖలాలు లేవు. అపార్ట్మెంట్లకు అనుమతులు ఇచ్చే సమయంలోను సి ఆర్ డి అధికారులు నిబంధనలను తుంగలో తొక్కు తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏ ప్రాంతం లో అపార్ట్మెంట్ నిర్మాణం జరుగుతుంది. స్థానిక వాతావరణం అనుకూలంగా ఉండా లేదా, రహదారులు నిబంధన ప్రకారం ఉన్నా యా లేవా అన్న వేమి అధికారులు పట్టించు కోవడం లేదు. బిల్డర్ల దగ్గర నుంచి సొమ్ము వసూలు చేసి అనుమతులు చేస్తున్నారని ఆరో పణలు ఉన్నాయి. అనుమతి ఇచ్చిన తర్వాత నిర్మాణ సమయంలో ఏ ఒక్క అధికారి ఒక్క అపార్ట్మెంట్ అయినా సందర్శించిన దాఖ లాలు లేవు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనిఖీలు చేసి జేబులు నింపుకొని వెళ్లిపోతున్నారు. అపార్ట్మెంట్ల అక్రమ నిర్మా ణాలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రజల నుంచి విన్నపాలు అవుతున్నాయి. జిల్లా అధికారుల చర్యలు ఏ విధంగా ఉంటాయో చూడాలి.

మోదుగుల పాపిరెడ్డి కన్నుమూత

పలువురు సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి తండ్రి, ప్రముఖ సోషలిస్టు నాయకుడు, న్యాయవాది మోదుగుల పాపిరెడ్డి (87) ఆదివారం వయోభారంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు వాసుదేవరెడ్డి, వేణుగోపాలరెడ్డి, కుమార్తె ద్రాక్షాయని ఉన్నారు. ఆయన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణతో కలిసి సోషలిస్టు ఉద్యమంలో పాల్గొన్నారని ఆయన సన్నిహితులు తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన పాపిరెడ్డి పలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఎటువంటి రాజకీయ పదవులు ఆశించకుండా ప్రజా సమస్యలపై పోరాడారు. న్యాయవాదిగా ప్రాక్టీసు నిర్వహించారు. మోదుగుల పాపిరెడ్డి కుమారుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాజీ ఎంపిగా ఉన్నారు. పాపిరెడ్డి భౌతికకాయానికి సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. పాపిరెడ్డి మృతికి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు,ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్ పాపిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాల్ రెడ్డికి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

124 రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 124 రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వై యెహొషువ, సిహెచ్ పిచ్చయ్య, బి నవనీతం, యోహాను, కె హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఎస్.కె.భాష, ఎం.సాంబశివరావు, డి.మాణిక్య రావు, బి. సూర్యప్రకాష్ రావు, ఎం.గురవయ్య పాల్గొన్నారు.

మైనర్ బాలురకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ చరణ్

వాహన దారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని 1వ పట్టణ సిఐ ఎంవి చరణ్, ట్రాఫిక్ సిఐ సిహెచ్ లోకనాథం వాహనదారులకు సూచించారు. ఎస్.పి కె.శ్రీనివాసరావు, డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నరసరావుపేట పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, ప్రమాదాల నివారణకు, వాహన దారులకు అవగాహన కల్పిస్తూ తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, మైనర్లు వాహనాలు నడపడాన్ని గమనించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని వాహన దారులు తప్పనిసరి వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నెంబర్ ప్లేట్ లేకపోయినా, మైనర్లు డ్రైవింగ్ చేసినా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. రాత్రివేళ ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను గురించి వివరించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A. No: 432/2023
IN
E. P. No: 74/2022
IN
O.S.No: 220/2021

Between:
తన్నీరు కోటేశ్వరరావు ....పిటిషనరు /డి.హెచ్.ఆర్
Vs
తన్నీరు సాంబయ్య వగైరాలు.... రెస్పాండెంట్లు/ ప్రపోజడ్ జె.డి.ఆర్.ఎస్ 2 to 5

నోటీసు

To
జెడిఆర్ 3/R3
తన్నీరు మౌనిక వురఫ్ మోనిక
D/o లేటు సాంబయ్య, R/o ప్రకాష్ నగర్,
నరసరావుపేట టౌన్, పల్నాడు జిల్లా,
నరసరావుపేట(డి.ఎం.సి)

పై నంబరు E.Pలో శ్రీకోర్టు వారు మీకు సెక్షన్ 50 సిపిసి ప్రకారం చనిపోయిన 1వ జె.డి.ఆర్కు మిగతా వారసులతోపాటు మిమ్ములను కూడా L.Rగా చేర్చమని డి.హెచ్.ఆర్దాఖలు చేసుకున్న పై నెంబరు పిటిషనులో 3వ రెస్పాండెంటుగా చూపబడిన మీకు ఎన్నిసార్లు ఈ విషయమై కోర్టు ద్వారా నోటీసులు పంపిన మీరు తీసుకోనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయవలసిందిగా శ్రీకోర్టువారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. ఇందునిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతర ములో ఉన్న యెడల 08-04-2025వ తేది ఉదయం 10.30 ని.లకు పైకోర్టు వారి యెదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపువలెను. లేనియెడల మీపరోక్ష మందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి
తేది 06-04-2025

ఇట్లు
పంచాగ్నుల రమేష్
పిటిషనర్ / డి హెచ్ ఆర్ తరఫు అడ్వకేట్
అద్దంకి- బాపట్ల జిల్లా
సెల్ నెం: 9948788290

ట్రాక్టర్ బోల్తా - వ్యవసాయ కూలీలకు గాయాలు

గాయపడిన మహిళా కూలీలు

ప్రజాశక్తి - మాచర్ల :

ట్రాక్టర్ బోల్తా పడి వ్యవసాయ కూలీలు గాయపడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మాచర్ల మండలం జమ్మలమడక గ్రామ సమీపంలో మిర్చి కోతలకు వెళ్ళిన వ్యవసాయ కూలీలు తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌పై వస్తుండగా బోల్తా పడింది. ఎనిమిది మందికి గాయాల య్యాయి. కోసిన మిర్చి బస్తాలను ట్రాక్టర్‌లో వేసి, వాటిపై కూలీలను కూర్చోబెట్టుకొని వస్తుండగా ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. వారిపై మిరప బస్తాలు పడ్డాయి. ఈ సంఘటనలో గాయాల పాలైన వారందరికీ రైతు మల్లయ్య మాచర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఇందులో మంగమ్మ, మట్టా శివపార్వతిలకు బలమైన గాయాలు తగలటంతో వారిని మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేటకు తరలించారు.

స్వర్ణ సూర్యప్రకాశరావు 10వ వర్ధంతి

స్వర్ణ సూర్యప్రకాశరావుకు నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు స్వర్ణ సూర్యప్రకాశ రావు 10వ వర్ధంతిని గొల్లపాలెం గ్రామంలో కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎక్సయిజ్ డిఎస్పీ దాసరి బాలయ్య అయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అభ్యున్నతికి, గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి మెల్కియా సూరి కుటుంబ సభ్యులు స్వర్ణచిన్నప్ప, థామస్, ఫ్రాన్సిస్, వేళంగిని రాజు, మహేష్, రైన్‌కుమార్, గురిజాల విజయ్ కుమార్ ఆయా పార్టీలకు చెందిన నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలోకి దూకిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

మునగాల సుబ్బారావుకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ మహమ్మద్ షఫీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం నాగార్జున సాగర్ కుడి కాలువ లోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన మునగాల సుబ్బారావు అనే 63 సంవత్సరాల వ్యక్తిని విజయపురిసౌత్ ఎస్ఐ మహమ్మద్ షఫీ తన సిబ్బందితో కలిసి కాపాడారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సుబ్బారావు ఆది వారం సాగర్ కుడి కాలువలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించారు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఎస్ఐ షఫీ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాణాపాయంతో కొట్టు మిట్టాడుతున్న సుబ్బారావును తాళ్ళు వేసి బయటకు తీశారు. సుబ్బారావు సురక్షితంగా బయటపడటంతో ఎస్ఐ షఫీ, ఏఎస్ఐ సోమలానాయక్, కానిస్టేబుల్ సురేష్, గోపి, హనుమా నాయక్‌లను స్థానికులు అభినందించారు.

ఉండవల్లి సెంటర్లో బన్నీ గ్యాంగ్ ఆగడాలు

స్పృహ కోల్పోయిన బాధితుడు (ఫైల్)

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లి సెంటర్ కేంద్రంగా బన్నీ గ్యాంగ్ ఆగడాలు ఇటీవల మితిమీరిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమాయకులపై అనవసరంగా దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనానికి దారి ఇమ్మని అడిగినందుకు స్పృహతప్పేటట్టు చితకబాదారు. బాధితుడు తాడేపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. స్థానికంగా ఆటోల్లో తిరుగుతూ రోడ్ల వెంట వెళ్లే వాళ్ళని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. కొద్ది రోజుల కిందట జరిగిన ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారోత్సవంలో తమ చేతివాటం ప్రదర్శించి బన్నీ గ్యాంగ్ రూ. 4లక్షలు కాజేసి నట్టు ఆరోపణలు ఉన్నాయి. బాధితుని ఫిర్యాదు మేరకు తాడే పల్లి పోలీసులు కేసు విచారిస్తున్నారు. కేసు రాజీ చేయటానికి టిడిపి మాజీ కౌన్సిలర్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

ఆకతాయిల బెడద

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని రేపల్లె వెళ్లే కరకట్ట రోడ్డులో, విజయవాడ క్లబ్ వైపు రోజుకు ఆకతాయిల బెడద ఎక్కువవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ళ ముందు, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాలను రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాల్లో నగదు దొరుకుతుందేమోనని వెతుకుతున్న దొంగలు నగదు దొరకపోవడంతో బండిలో ఉన్న సిబుక్కులను ఎత్తుకుపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 12 గంటల సమయంలో కూడా నలుగురు వ్యక్తులు బైకుల మీద ఇష్టం వచ్చిన రీతిలో మితిమీరిన వేగంతో స్వైర విహారం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒంటరిగా మహిళలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారని చెప్పారు. కట్టమీద రాత్రి వేళల్లో వెళ్లే వారిని కూడా బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిల బెడద కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకతాయిల బెడద గురించి వివరిస్తున్న బాధితురాలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.హెచ్. ప్రసాద్

బనకచర్ల ప్రాజెక్టుకు గుర్రం జాషువా జలాశయంగా పేరు పెట్టాలి

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో వివిధ సంఘాల తోటి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంతో బండ్ల మోటు వద్ద ఏర్పడే బనకచర్ల ప్రాజెక్టుకు జాషువా జలాశయం పేరు పెట్టాలని వివిధ సంఘాల వారు విజ్ఞాపన చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండ్లమోటు లెడ్ మైన్ విశ్రాంత ఉద్యోగి ఎం.హెచ్.ప్రసాద్ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో పుట్టి విశ్వనరుడిగా పేరుగాంచిన కవి కోకిల గుర్రం జాషువా పేరు పెట్టేలా బనకచర్ల జలాశయానికి జాషువా జలాశయంగా నామకరణం పెట్టాలని కళా సంఘాల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్, మాల మహానాడు నాయకులు కీర్తి పాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ సతీమణి షకీలా, జాషువా సాంస్కృతిక సమాఖ్య కమలా రామ్,,గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వర్లు హెల్త్ సూపర్‌వైజర్ జయబాబు, మల్లికార్జున రావు, హబీబ్ భాషా పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న మాధవరావు

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

బ్రాహ్మణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవి మాధవ రావు ఆధ్వర్యంలో విద్యానగర్ 4వ లైన్‌లోని చింతలచెరువు రఘు ఇంటి వద్ద నాలుగు కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రముల బహూకరించారు. ప్రతినెల దాత అయిన చింతల చెర్వు రాఘవేంద్ర రావు, ఉల్లగంటి బాలగురునాథం, నందిగామ పవన్ కుమార్, గాయత్రీ చింతలపూడి కృష్ణ మోహన్ సహాయ సహకారంతో నాలుగు కుటుంబాలకు సహాయం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఎం.వి.శర్మ, భువనగిరి సుబ్రహ్మణ్యం, ధారా రామమూర్తి, ధూళిపాళ్ళ వెంకటేశ్వర్లు, దిట్ట కవి శ్రీనివాసాచార్యులు, ధూళిపాళ్ళ నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్ పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఫేక్ కాల్స్ పట్ల వ్యాపార సంస్థ ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు వనమా సాంబశివరావు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పట్టణ వ్యాపారస్తులకు ఫుడ్ ఇన్స్పెక్టర్, ఆదాయపు పన్ను అధికారి, సేల్ టాక్స్ ఆఫీసర్ అంటూ ఫేక్‌కాల్ వచ్చిం దన్నారు. అటువంటి కాల్స్ పట్ల ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఫేక్ కాల్స్ వస్తే చాంబర్‌కు తెలియ జేయాలన్నారు. వాటిపై పోలీసులకు తెలియజేసి వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు. వ్యాపార సంస్థలకు అధికారులమంటూ ఎవరైనా వస్తే మొదట వివరాలు అడగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ కోశాధికారి పచ్చి పులుసు సతీష్ కుమార్, ట్రెజరర్ దేసు శ్రీనివాసరావు పలు వ్యాపార సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ముస్లిముల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పానకం

ప్రజాశక్తి పెదకూరపాడు

భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలతో సమ్మిళితమై ఉన్న భారతావని విభిన్నత్వంలో కూడా ఏకత్వాన్ని సాధించి సర్వమానవ సౌభ్రాగృత్వంతో ముందుకు సాగుతోన్నదని టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శ్రీరామనవమి సందర్భంగా టిడిపి ముస్లిమ్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో హిందువులకు పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వి.అప్పారావు, షేక్ ముంతాజ్ బేగం, బి.రాంగోపాల్‌రావు, షేక్ అజముల్లా, షేక్ దిలీప్, షేక్ మస్తాన్ షరీఫ్, జి.శివ పాల్గొన్నారు.

రావిపాడులో క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆటలు ఆడటం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపుందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని సాయి డిఫెన్స్ అకాడమీలో ఆదివారం నరసరావుపేట మండలంలోని రావిపాడు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. క్రీడల ద్వారా శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులు ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొగలిగే మానసిక ధైర్యం వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. అనంతరం కొద్దిసేపు బౌలింగ్, బ్యాటింగ్‌తో ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ సిహెచ్.వంశీకృష్ణ, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు పి.ఎ.సునీల్ కుమార్, టిడిపి నాయకులు వాసిరెడ్డి రవీంద్ర, గుత్తా అంకమ్మ చౌదరి, కమిటీ సభ్యులు రాజశేఖర్, కృష్ణంరాజు, మధు, అనిల్, ప్రమోద్, వెంకటేష్ పాల్గొన్నారు.

తమిళనాడు రాష్ట్రం మధురైలో జరుగుతున్న సిపిఎం జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు హాజరైన ఆ పార్టీ పల్నాడు జిల్లా శ్రేణులు.

వీనుల విందుగా నాటికలు

- యడ్లపాడులో ముగిసిన సుందరయ్య కళానిలయం నాటిక పోటీలు
- మూడ్రోజులపాటు కోలాహలంగా ప్రదర్శనలకు తరలివచ్చిన ప్రేక్షకులు

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు కుటుంబం

ప్రజాశక్తి - యడ్లపాడు

పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులో మూడ్రోజులపాటు నిర్వహించిన 22వ జాతీయ స్థాయి నాటి పోటీలు ఆదివారం ముగిశాయి. సందేశాత్మక ఇతివృత్తాలతో ప్రదర్శిఌచిన నాటికలు ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపేడేశాయి. సమాజాన్ని పట్టిపీడిస్తున్న అంశాలను కథాంశాలుగా ఎంచుకుని నాటికలను దర్శకులు తీర్చిదిద్దగా దానికి అనుగుణంగానే కళాకారులు పోటీపడిమరీ నటించి ప్రదర్శనలను రక్తి కట్టించారు. ప్రదర్శనలను వీక్షించేందుకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రేక్షకులు తరలిరాగా ఏర్పాట్లను వేదిక (తెలుగు నాటక రంగం సమ్మేళనం) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు దంపతులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. సుందరయ్య కళానిలయం బాధ్యులు ఎం.రామారావు, జె.శంకరరావు, షేక్ ఖాజా, ఎన్.మాధవరావు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో బహుమతులు ప్రదానం చేశారు.

జనరల్‌బోగిలు

ప్రదర్శనల్లో భాగంగా రెండోరోజైన శనివారం రాత్రి మొదటి ప్రదర్శనగా పిటి మాధవ్ రచించిన 'జనరల్ బోగీలు' నాటికను గోపరాజు విజయ్ దర్శకత్వంలో శ్రీసాయి ఆర్ట్స్ (కొలకలూరి) వారు ప్రదర్శించారు... సావిత్రమ్మ కుమారుడు జనరల్ బోగీలో ప్రయాణిస్తుండగా జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతాడు. కానీ జనరల్ టికెట్ కావడంతో అతడి వివరాలు రైల్వే వద్ద ఉండవు. మృతదేహాన్ని గుర్తించలేని ఆమె ఎదురు చూస్తూ నిరవధిక బాధలో కూరుకుపోతుంది. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ఆమె ఉత్తరాల ఉద్యమాన్ని ప్రారంభిస్తుంది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు వరుసగా ఉత్తరాలు రాస్తూ పోరాడుతుంది. ఆమె పోరాటం కొంతమందికి అసౌకర్యంగా మారి, ఆమెపై కుట్రలు జరుగుతాయి. చివరికి ఆమెను అరెస్టు చేస్తారు, అయినా ఆమె ఆత్మబలాన్ని చెరపలేరు. జైలులోనూ ఆమె ఉద్యమ గళం ఆగదు. ఆమె తీర్పుల కీటకాలుగా మారి సామాన్య ప్రజల్లో చైతన్యం నింపుతుంది. చివరికి జనరల్ బోగీలలో ప్రయాణికుల వివరాల నమోదుపై దేశవ్యాప్తంగా చర్చ మొదలవుతుంది..

నా శత్రువు...

రెండో ప్రదర్శనగా అక్కల తామేశ్వరయ్య రచించిన 'నా శత్రువు' నాటికను వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో జయభేరీ థియేటర్స్ హైదరాబాద్ వారు ప్రదర్శించారు... ప్రస్తుత కాలంలో మనిషి మనుగడ సాంకేతికంతో ముడి పడిపోయింది సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, సోషల్ మీడియాతో గంటలకు గంటలు గడుపుతున్నారు. బంధాలకు, అనుబంధాలకు దూరమై ఎవరికి వారు ఒంటరిగా మిగిలిపోతున్నారు. టెక్నాలజీ అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మంచి మిత్రుడు మరొకరు ఉండరు. అవసరానికి మించితేనే జీవితంలో ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని.. అనే సందేశంతో నాటిక సాగింది.

ఋతువు లేనికాలం...

మూడో ప్రదర్శనగా శ్రీ అగస్త్య రచించిన 'ఋతువు లేనికాలం' నాటికను వైవి చౌదరి దర్శకత్వంలో కళానికేతన్ వీరన్నపాలెం వారు గోరంట్ల సురేంద్ర నిర్వహణలో ప్రదర్శించారు... ప్రస్తుత కాలంలో ఆడపిల్లలకు భర్త కావాలి. అతనికి తల్లిదండ్రులు, తోబుట్టువులు అక్కర్లేదు. అలాంటి వారు దొరికేవరకు పెళ్లి కూడా చేసుకోవడం లేదు. వీరి దృష్టిలో అత్త ఓ శత్రువు, ఆడబిడ్డలు రాక్షసులు, స్వీకరణే తప్ప తిరిగిఇచ్చే ఆలోచన లేని వ్యక్తిత్వం. వీరికి వస్తువుపై వ్యామోహం తప్ప జీవితంపై ప్రేమ లేదు. విలాసాలు, ఫ్యాషన్లకు బానిసలై భర్త, పిల్లలకు దూరమై ఒంటరి జీవితాలను గడుపుతున్నారు. అలాంటి వారికి కుటుంబ బంధాల విలువల్ని తెలియజేసేదే ఈ నాటిక సారాంశం.

గురితప్పిన వేట...

రెండోవ రోజు నాలుగో ప్రదర్శనగా పి.మృత్యుంజయరావు రచించిన 'గురితప్పిన వేట' నాటికను వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో రసఝరి పొన్నూరు వారు ప్రదర్శించారు... ఒక నైతిక సందేశాన్ని నాటకీయంగా మలిచిన ఈ నాటిక అడ్డదారులను ఆశ్రయించిన ఓ యువకుడి ప్రయత్నాన్ని ఎలా అడ్డుకుంది అనే విషయాన్ని ఆసక్తిదాక సంఘటనలతో ప్రదర్శించారు.

నాన్న నేనొచ్చేస్తా...

చివరిరోజైన ఆదివారం మొదటి ప్రదర్శనగా తాకబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటికను అమృత లహరి దర్శకత్వంలో అమృత లహరి థియేటర్స్ (గుంటూరు) వారు ప్రదర్శించారు... తల్లిదండ్రులు తమ పిల్లలపై చూపించే అపారమైన ప్రేమ, మితిమీరిన వాత్సల్యం అనేక సందర్భాల్లో పిల్లల భవిష్యత్తుపై దుష్ప్రభావం చూపుతోందని తెలియజేసే కళారూపమే ఈ నాటిక. ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేకంగా 'మన కూతురు బాగుండాలి' అనే ప్రేమతో, పెళ్లికి ముందు పూర్తిస్థాయిలో స్వేచ్ఛనిచ్చి పెంచుతారు. అయితే వివాహానంతరం వచ్చిన మనస్పర్థలను తట్టుకోలేక, మానసిక స్థైర్యం లేని పరిస్థితి ఉత్పన్నమవుతుంది. చిన్న చిన్న విభేదాలకే పెద్ద సమస్యలా భావించి, 'నాన్న, నేను వచ్చేస్తున్నా' అనే మాటతో పుట్టినింటి బాట పడుతారని హెచ్చరిస్తూ నాటిక ప్రదర్శన ముగిసింది.

బ్రహ్మాస్వరూపం...

ఆదివారం రెండో ప్రదర్శనగా శ్రీస్నిగ్ధ రచించిన 'బ్రహ్మాస్వరూపం' నాటికను టివి పురుషోత్తం దర్శకత్వంలో మైత్రి కళానిలయం (విజయవాడ) వారు ప్రదర్శించారు... ప్రశాంతమైన జీవితంలోకి ఊహించని కష్టాలు ప్రవేశించి, ప్రతికూల శక్తుల రూపంలో విఘాతం కలిగిస్తాయి. ఆ క్షణాల్లో మనం నిరాశతో తారాడుతుండగా, విధి భయంకరమైన పరీక్షగా మారుతందని చాటిచెప్పే నాటిక 'బ్రహ్మాస్వరూపం'. విషమ పరిస్థితుల్లోనూ ధర్మాన్ని నిలబెట్టేందుకు బ్రహ్మాస్వరూపమే ప్రత్యక్షమై తుది న్యాయాన్ని ప్రసాదిస్తాడు. అందుకే స్వచ్ఛమైన దృష్టితో చూసినప్పుడు, మనసుకు నచ్చిన జీవితం మన కళ్లముందే సాకారమవుతుందని తెలియజేసే ప్రదర్శన ఇది.

బావా ఎప్పుడు వచ్చితివి...

ప్రత్యేక ప్రదర్శనగా పివి భవాని ప్రసాద్ రచించిన 'బావా ఎప్పుడు వచ్చితివి' నాటికను జరుగుల రామారావు దర్శకత్వంలో యడ్లపాడు మానవత వారు ప్రదర్శించారు... కుటుంబ వ్యవస్థలో అమ్మానాన్న, అక్కాచెల్లి, అత్తాబావ అనే పిలుపుతో బంధాలు బలపడతాయి. కానీ వరసలు కలుపుతూ పిలిచే పిలుపుల వల్ల అమాయకపు భార్య, అపోహలు, అభద్రతా భావం కలిగిన భర్త మధ్య కొన్ని విచిత్ర సంఘటనల్నీ కడుపుబ్బ నవ్విస్తూ, సున్నితంగా కనువిప్పు కలిగించే నాటిక ఇది.

పండగ పూటా పోరాటమే..!

- 18 రోజుకు మున్సిపల్ కార్మికుల దీక్షలు
- ఇకనైనా స్పందించకుంటే నిరవధిక దీక్షకు పూనుకుంటామని స్పష్టం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మికులకు దండలేసి దీక్షలను ప్రారంభిస్తున్న మస్తాన్‌వలి

తమ ఆవేదనను అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోకుండా పండగ రోజుల్లోనూ తమను ఇబ్బందులు పెడుతున్నారని మున్సిపల్ కార్మికులు ఆవేదన వెలిబుచ్చారు. పని చేసిన కాలం మొత్తానికి వేతనం, పని భద్రతతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం 18 రోజుకు చేరాయి. శ్రీరామ నవమి సందర్భంగా కార్మికులు నిరాహారదీక్ష చేపట్టగా దీక్షలను సిఐటియు జిల్లా నాయకులు షేక్ మస్తాన్‌వలి ప్రారంభించి మాట్లాడారు. ఆరేళ్లుగా పని చేస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయడంతో యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికులు మాట్లాడుతూ తమ ఇంటిల్లపాది అర్ధాకలితో బతుకుతున్నామని, ధికారులు తీరు మారకుంటే నిరవధిక దీక్షకు పూనుకుంటామని అన్నారు. దీక్షల్లో కార్మికులు జొన్నలగడ్డ వీరమ్మ, సమాధానం, సెల్వి, లత, నాగమణి, శ్రీను, చంద్రయ్య, రాజు, ఖాదర్ వలీ, వీరయ్య, సాంబయ్య, అబ్రహం, సాల్మన్, దేవా కూర్చున్నారు. యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు జీవరత్నం, వీరకుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - మేడికొండూరు

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. మేడికొండూరులో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల ఆశ వర్కర్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు గత 20 ఏళ్లుగా ప్రజానీకానికి అమోఘమైన సేవలు అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలోను ఇతర సందర్భాలలో ప్రజలకు ఆశ వర్కర్లు అందిస్తున్న సేవలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయని అన్నారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించినా ప్రభుత్వాల స్పందన నామమాత్రంగా ఉందని అన్నారు. పోరాటాల ద్వారానే నెలవారి జీతాలు, యూనిఫారం, బ్యాంకు ద్వారా జీతాలు తదితర సౌకర్యాలు సాధించుకోబడ్డాయని గత ఏడాది చేసిన పోరాటం ఫలితంగా రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్ల కు పెంపుదల, రిటైర్మెంట్ బెనిఫిట్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు తదితర సౌకర్యాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రాతపూర్వక ఒప్పందం చేసిందని అన్నారు. ఏడాది గడిచినా ఒప్పందంలోని అంశాలకు జీవోలు మంజూరు చేయడం లేదని దీని ద్వారా ఆశ వర్కర్లు, వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు సంబంధంలేని పనులను వారి చేత చేయించరాదని జిల్లా, రాష్ట్ర అధికారులు పదేపదే రాతపూర్వకమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ స్థానిక అధికారులు ఆశా వర్కర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని దీనిని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్కడక్కడ సబ్ సెంటర్లు, వెల్నెస్ సెంటర్లలో ఆశ వర్కర్లను ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోవాలని, ఏఎన్ఎంలు చేయాల్సిన సర్వేలు ఆశ వర్కర్లు చేయాలని గదమాయిస్తున్నారని ఇలాంటి వాటిని జిల్లా అధికారులు జోక్యం చేసుకొని నివారించాలని కోరారు. చట్ట ప్రకారం ఉద్యోగులకు ఇచ్చే క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు, పండుగ సెలవులు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 17వ తేదీ గుంటూరులో జరిగే సదస్సులో ఆశా వర్కర్లు అందరూ పాల్గని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత టాన్య తదితరులు పాల్గొన్నారు.

బిటి రణదీవేకు ఘన నివాళులు

ప్రజాశక్తి- తాడేపల్లి

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, 1970 దశకంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కార్మిక సంఘం ఏర్పాట్లు కీలక పాత్ర పోషించిన బిటి రణదీవే 35 వర్థంతి ఆదివారం స్థానిక ప్రకాష్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రణదీవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ రణదీవే మృతి కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో బి.ప్రభాకర్ రావు, బాబురావు, బి.వెంకటేశ్వర్లు, వెంకన్న, సూరి, బి.అంకయ్య, నవనీతం, ఆశీర్వాదం, సాంబయ్య, ఎస్.కే.జానీ, రమణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ కోసం కొత్త ఆటో

ప్రజాశక్తి-తెనాలిరూరల్

యంగ్ జనరేషన్ టీం సంస్థ కొనుగోలు చేసిన నూతన ఆటోను తెనాలి మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. సంస్థ నిర్వహించే కార్యక్రమాలకు వాహన వినియోగం అనివార్యంగా ఆటో కొనుగోలు చేసినట్లు సంస్థ అధ్యక్షులు సాధిక్ తెలిపారు. నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణి చేయడంతో పాటు అతితక్కువ ధరలకే పాసింజర్ సర్వీసులకు వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కఠారి హరీష్, విజ్ఞాన్ యూనివర్సిటి అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్షాన్, సిరి కృష్ణ, నవీన్, శివ, యంగ్ జనరేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆటోను ప్రారంభిస్తున్న తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

మంత్రి మనోహర్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినోత్సవం సందర్భంగా తెనాలి వైకుంఠపురం దేవస్థానంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కురగంటి రఘురామయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన తహశీల్దార్..

- సామాన్యులు, రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి
- విచక్షణాధికారాన్ని ఉపయోగించటంలో మేటి
- రౌడీషీటర్‌కు రిమాండ్ విధింపు చారిత్రాత్మకం
- వరుసగా మూడుసార్లు ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్న కోటంరాజు వెంకట గోపాలకృష్ణ

జిల్లా కలెక్టర్ నుంచి బెస్ట్ తహశీల్దార్ పురస్కారం అందుకుంటున్న గోపాలకృష్ణ

రౌడీషీటర్‌కు రిమాండ్ విధిస్తున్న తహశీల్దార్, సాగునీటి సమస్యపై రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - తెనాలి

పనిచేసిన ప్రతిచోట తనదైన శైలి..పనిలో విలక్షణం.. నెదురూ బెదురూ లేని స్వభావం..సామాన్యుల సమస్యలపై ప్రత్యేక దృష్టి...శాఖాపరమైన విమర్శలకు కళ్లెం వేయడం ఆయన నైజం. అధికారిగా ఆయన దృష్టికి వచ్చిన సమస్యపై వెంటనే స్పందించటం, అవసరమైతే బాదితుల వద్దకు వెళ్ళి దానికి శాశ్వత పరిష్కారం దిశగా తీసుకునే చొరవ ప్రశంసనీయం. వృత్తి రీత్యా తనవంతు ధర్మం ఏ మేరకు నిర్వర్తిస్తున్నామనే నిరంతర ఆత్మపరిశీలన అతని సొంతం. ఉత్తమ ఉద్యోగిగా 19 సార్లు, తహశీల్దార్ హోదాలో వరుసగా మూడు సార్లు ఉన్నతాధికారుల నుంచి ఉత్తమ సేవా పురస్కారాలను అందుకుని అటు అధికారులను, ప్రజాప్రతినిధులను, మరో వైపు సామాన్యులు, రైతుల మన్ననలను అందుకుంటున్న ఆయనే తెనాలి తహశీల్దార్ కోటంరాజు వెంకట గోపాలకృష్ణ.తెనాలి తహశీల్దార్‌గా కె.వి గోపాలకృష్ణ గతేడాది ఆగస్టు ఒకటిన బాధ్యతలు స్వీకరించారు. ఎనిమిది నెలల కాలంలో అధికారి హెూదాలోనే కాకుండా సామాజిక సేవాదృక్పదంతో చేసిన కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాయి. మండల గ్రామాలకు చెందిన రైతుల భూములకు సంబంధించి అడంగళ్‌లో దొర్లిన తప్పిదాలతో, సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో రెడ్ మార్కులో భూములు ఉండటంతో కొనుగోలు, అమ్మకాలు లేక రైతులు ఇబ్బంది పడ్డారు. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ సమస్యను అధ్యయనం చేసిన తహశీల్దార్ జిల్లా జాయింట్ కలెక్టర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఉన్నతాధికారుల అనుమతితో వారం రోజులు రాత్రింభవళ్ళు శ్రమించి దాదాపు 5800 అడంగళ్ ఖాతాలను సరిచేసి, వారి సమస్యకు పరిష్కారం చూపారు. అలాగే ఖరీఫ్‌లో హైలెవల్ ఛానల్ నుంచి సాగునీరందటం లేదని ఖాజీపేట, హాఫ్‌పేట, తంగెళ్ళమూడి గ్రామాల రైతులు ఆందోళనకు దిగిన సమయంలో స్పందించిన తహశీల్దార్ ఇరిగేషన్ ఎస్ఈ, ఈఈలతో సమీక్ష జరిపి సాగునీటి సమస్యకు చెక్ పెట్టారు. పెదవడ్లపూడి నుంచి దిగువ వరకు కాలువలో నీటి అడ్డంకులను తొలగింపజేసి, దిగువ ప్రాంతం తంగెళ్ళమూడి వరకు సాగునీరందేలా చేశారు.పైగా బకింగ్‌హామ్ కెనాల్‌లో హైపవర్ మోటార్ల సాయంతో హైలెవల్ ఛానల్‌కు నీటిని మళ్ళించారు. ముఖ్యంగా జగనన్న కాలనీ కోసం ప్రభుత్వ సేకరించిన దాదాపు 198 ఎకరాలు ఇప్పటికీ రైతుల పేరునే ఉన్నట్టుగా గుర్తించారు. వరదలు, అధిక వర్షాల సమయంలో ముంపు గ్రామాల్లో పర్యటించి సహాయక శిభిరాలు ఏర్పాటు చేసి, బాధితులకు బాసటగా నిలిచారు.

మండల మేజిస్ట్రేట్ హోదాలో తొలిసారి రౌడీషీటర్‌కు రిమాండ్

దాదాపు రాష్ట్రంలోనే తొలిసారిగా మండల మేజిస్ట్రేట్ హెూదాలో ఒక రౌడీషీటర్‌కు రిమాండ్ విదించటం తహశీల్దార్ కెవి గోపాలకృష్ణకు దక్కిన అరుదైన ఘనతగా చెప్పొచ్చు. వివిద కేసుల్లో నిందితులను పోలీసులు తహశీల్దార్ ఎదుట హాజరు పరచటం, వారిని బైండోవర్ చేయించటం పరిపాటి. అయితే అందుకు భిన్నంగా రౌడీ షీటర్లకు ఓ కఠినమైన హెచ్చరిక లాంటి నిర్ణయం తీసుకున్నారు. బైండోవర్‌లో ఉండి కూడా నేరానికి పాల్పడిన రౌడీ షీటర్ రమేష్‌కు 30 రోజులు రిమాండ్ విదించి రేపల్లె సబ్ జైలుకు తరలించాల్సిందిగా తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ అదేశించారు. మేజిస్టీరియల్ అధికారాన్ని ఉపయోగించి రౌడీషీటర్‌కు రిమాండ్ విదించటం రాష్ట్రంలోనే ప్రధమం.

సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర

జెఎంజె స్వధార్ హెూమ్‌లో ఆశ్రయం పొందుతూ చేతివృత్తులపై ఆధారపడి తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఆర్టీసి డిపోమేనేజరుతో మాట్లాడి డిపో ఆవరణలో స్టాల్ ఏర్పాటు చేయించారు. రూరల్ గ్రామం అంగలకుదురు, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో సంభవించిన అగ్నిప్రమాదాల్లో నష్టపోయిన బాధితులకు శాఖాపరంగా ఆదుకోవటమే కాకుండా గణేష్ యూత్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వంటి స్వచ్ఛంద సేవాసంస్థల ద్వారా నిత్యావసరాలు, వంటపాత్రలు పంపిణీ చేయించారు. అదేవిదంగా రూరల్ గ్రామం కొలకలూరు, పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలోని సంక్షేమ వసతి గృహాల్లో దాతల సహకారంతో కొన్ని ముఖ్యమైన వసతులు కల్పించారు.

నా ఫ్యామిలీ ఫొటో తన ఇంట్లో పెట్టుకున్నాడు

అధికారిగా ఇంతకన్నా సంతృప్తి ఏమి ఉంటుంది..

ఎక్కడ పనిచేసినా నా హోదా ప్రజలకు ఉపయోగ పడాలన్నదే నా తపన. వృత్తిని దైవంగా భావిస్తా. అధికారాలను పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగించి పనిచేయాలన్నదే నా తపన. తెనాలిలో తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజుల్లోనే శాఖాపరంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి, 5800 అండంగళ్ తప్పిదాలను సరిచేశాం. బుర్రిపాలెం గ్రామంలో రెవిన్యూ సమస్యలను సున్నా చేయాలన్న లక్ష్యంతో ఆ గ్రామాన్ని మోడల్‌గా తీసుకున్నాం. అలాగే పెదరావూరు రీ సర్వే ప్రక్రియ జగరుతుంది. హైలెవల్ ఛానల్ పరిధిలో రైతుల సాగునీటి సమస్యనూ పరిష్కరిం చాం. ఇక సామాజిక సేవాకార్యక్రమాల నిర్వహణ ఒక బాధ్యతగా భావిస్తా. ఇప్పటికి 19 సార్లు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నా. తహశీల్దార్ హెూదాలో చేబ్రోలు, సూళ్ళూరుపేట, తెనాలి వరుసగా మూడు సార్లు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నా. అన్నింటినీ మించి సుద్దపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పంట కాలువ సమస్యను పరిష్కరించినందుకు నా ఫ్యామిలీ ఫొటో తన ఇంట్లో పెట్టుకున్నాడు. అధికారిగా నాకు అంతకంటే తృప్తేముంటుంది?

- కె.వి.గోపాలకృష్ణ, తహశీల్ధార్, తెనాలి

బాలికోన్నత పాఠశాలలో మ్యాట్ ఏర్పాటు చేసి, విద్యార్థులతో మాట్లాడుతున్న తహశీల్దార్

దిగుబడిలేక దిగాలు

ఆందోళనలో కంది రైతులు ... గిట్టుబాటు ధరతో ఈ యేడాది నష్టమే

ఆరబోసిన కంది

తూకం వేస్తున్న కందులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల: పంటల దిగుబడి సరిగాలేక ప్రతి ఏడాది అప్పులపాలవుతోన్న అన్నదాతకు ఈసంవత్సర మూ నష్టాలే మిగులనున్నాయి. సరైన దిగుబడి లేకపోవ డం, పంటకు చీడలు పట్టడం, పురుగు మందులు, ఎరువుల కు అధికంగా ఖర్చు చేసినా చివరకు పంటకు సరైన దిగు బడి లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత సంత్స రం పంటల దిగుబడి కొద్దిగా పెరిగి గిట్టుబాటు ధరలు ఆశా జనకంగా ఉండటంతో రైతులు ఈ సంవత్సరం కూడ అదే ఆశతో పంటలు వేశారు. అయితే ఆశించిన మేంకు దిగుబడి లేక ధరలూ లేకపోవడంతో రైతుకు నిరాశ మిగిల్చింది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 4,664 హెక్టార్లలలో కంది పంట వేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. హెక్టార్‌కు సుమారుగా 19,768 క్వింటాళ్ళ దిగుబడి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

ఎకరం కంది పంటకు సుమారుగా కౌలు, వ్యవసాయం పురుగుమందులు, కూలి ఇతరత్రా ఖర్చులు రూ. 50 నుంచి 60వేలకు పైగా ఖర్చు అవుతోంది. ఎకరానికి ఏడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం ఏపి మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి క్వింటాకు 12శాతం తేమతో రూ.7,550 లు చెల్లిస్తోంది. అధికారులు ఇంటి వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేసే సదుపాయం ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిట్టుబాటు ధర ఆశాజనకంగా లేకపోవడంతో గత యేడాది క్వింటా కంది రూ.14 వేల వరకు ఉండగా ఈ సంవత్సరం కేవలం రూ.7,550లు ఉంది. ఎకరానికి ఏడుక్వింటాళ్ళ కందికి జల్లెడ పట్టడం, అరబెట్టే క్రమంలో సుమారుగా 50కిలోల వరకు పోతాయనీ, పైగా ఎత్తుడు, దించుడు కూలి క్వింటాకు రూ.100 లు రైతులే చెల్లించుకోవాల్సి వస్తుంది. దీంతో రైతుకు ఎకరానికి రూ.20వేలు నష్టం వస్తోందనీ, పైగా చాకిరి కూడ వృధా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ క్రాప్ నమోదు ఉంటేనే పంటను కొనుగోలు చేస్తామని నిబంధన పెట్టడంతో భూములు కౌలుకు తీసుకున్న రైతులు, భూములకు సరైన ధ్రువపత్రాలు లేని రైతులు పంట నమోదు చేసుకునే వీలులేక చేసేదేమిలేక క్వింటా రూ.6,300 నుండి 6,400లకు దళారులకు తెగ నమ్ము కుంటున్నారు. మరికొందరైతే ప్రభుత్వం పంట డబ్బులు ఎప్పుడు వేస్తుందో అని తక్కువ ధరకు అమ్ము కుంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే ఏడాది కంది వేయలేమని రైతులు చెబుతున్నారు.

వచ్చే ఏడాది పంటలు వేయలేం

పంటల దిగుబడి ఈ సంవత్సరం నిరాశను మిగిల్చింది. గిట్టుబాటు ధరకూడ సరిగా లేదు. మిర్చి, కంది వేశాం. రెండూ దిగుబడి సరిగా రాలేదు. ధర కూడ గత సంవత్సరం కంటే మరింత దారుణంగా ఉంది. కౌలు రైతు కార్డులకు రైతు సేవా కేంద్రంలోకి వెళితే సర్వర్ పని చేయ డం లేదని అంటున్నారు. ఈ సంవత్సరం నిండా అప్పుల్లో మునిగిపోయా. వచ్చే ఏడాది వ్యవసాయం చేయలేము. **- కోటి రెడ్డి(బ్రహ్మణపల్లి)**

ధరలు దారుణంగా ఉన్నాయి

గత సంవత్సరం కందికి రూ.14వేలు వరకు ధర పలి కింది. ఈ సంవత్సరమూ అలాగే ఉంటుందని ఆశతో కంది పంట వేశా. అయితే గతంతో పోలిస్తే ప్రస్తుతం ధరలు మరింత దారుణంగా ఉన్నాయి. మిర్చికి రూ.లక్షల్లో పెట్టు బడి పెట్టా. సరైన ధరలు లేక అప్పుల్లో కూరుకుపోయా. ఈ సంవత్సరం వ్యవసాయం నష్టం మిగిల్చింది. **- అంజి(తుమ్మల చెరువు)**

వాడవాడల కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - మాచర్ల :

శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం మాచర్ల పట్టణం, మండల పరిధిలో అనేక గ్రామాల్లో కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సీతా రాముల ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తీసు కొచ్చి మంగళ వాయిద్యాల నడుమ, వేద పండితుల మంత్రోచ్ఛపాల మధ్య శ్రీ సీతారాముల తలంబ్రాల కార్య క్రమాన్ని నిర్వహించారు. మాచర్ల శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఉదయం 8 గంటల నుండి హోమం, బలి హ రణం, స్వామివారి ఎదురుకోల నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకం గా అలంకరించి దేవాలయం నుండి మేళతాళాలతో కళ్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. విడేల గోపాల దంపతులు ఉషారాణి కళ్యాణ పీటలపై కూర్చున్నారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలను దేవకి వెంకట శేష పుల్లారావు, టీవీఎస్ పుల్లారావు దంపతులు అందజేశారు. సాయంకాలం స్వామివారిని ప్రత్యేక వాహనంపై అలంక రించి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు బచ్చు రామారావు, గౌరవ అధ్య క్షులు మారం ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి కొత్తూరు వెంకట బాలకోటేశ్వరావు, కోశాధికారి భవనారి లోకనాథ కోటేశ్వరరావు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆల య ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవ స్థానంలో కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల వేదమంత్రోచ్చారణాల నడుమకళ్యాణ మహోత్స వం నిర్వహించారు. ఎంపీలావు కృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి నల్ల పాటి రామచంద్ర ప్రసాద్, జనసేన నాయకులు జిలాని, టిడిపి నాయకులు విజయకుమార్ పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో అన్ని గ్రామాలలో రామాల యాల వద్ద చలువపందిర్లు వేసి సీతారాముల కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రివేళల్లో ఆలయాల ఆవరణలో భజనా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రాములోరి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ప్రజాశక్తి కారంపూడి

కారంపూడి పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలలో శ్రీ సీతారామ కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్ మండపంలో, అంకాళ్ళమ్మ గుడి సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం మండల పరిధిలోని పలు మండపాలలో శ్రీరామనవమి శ్రీ సీతారామ కళ్యాణం అంగరంగ వైభవం గా జరిగింది. అనంతరం బెల్లం పానకం, వడపప్పు, మహా అన్న ప్రసాదం పంపిణీ జరిగింది. అనంతరం శ్రీ సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను కారంపూడి మెయిన్ రోడ్డు వీధులలో భక్తజనులు తరలిరాగా అంగరంగ

పేరుకే 100పడకల ఆసుపత్రి

సౌకర్యాలు లేక, వైద్యుల కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

స్థానిక ఏరియా ఆసుపత్రి

చికిత్స కోసం వచ్చిన వృద్ధురాలు

ప్రజాశక్తి-చిలకలూరిప

స్థానిక ఏరియా ఆసుపత్రి పేరుకే 100 పడకలుగా విస్తరించింది. పేషెంట్లకు కావలసిన అధునాతన స్కానింగ్ పరికరాలు ఇతర సౌకర్యాలు కల్పించడంలో విఫలయ్యారని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు 150, 200 మంది రోగులు వస్తుంటారు. వారిలో పేద నిరుపేదలు, గర్భిణీలు ఎక్కువగా వస్తుంటారు. గర్భిణులకు టిఫా స్కా నింగ్, ఇతర పరీక్షలకు అవసరమైన స్కానింగ్‌లు లేవు. ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉన్నా డాక్టర్లు లేరు. అవసరాన్ని బట్టి ప్రభుత్వ డాక్టర్లు పేషెంట్లకు స్కానింగ్‌లను బయటకి రాస్తున్నారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వా సుపత్రుల్లో ఎంఆర్, సిటీ స్కానింగ్ మిషన్లు, ఇతర స్కానింగ్లు, వాటికి సంబంధించిన డాక్టర్లు, సిబ్బంది లేరు. నిత్యం ఈ ఆసుపత్రిలో 10 నుంచి 15 ఎంఆర్ఐ స్కానింగ్లు, 20 నుంచి 30సిటీ స్కానింగ్లు చేయిచుకునే వారు, ఇతర స్కానింగ్లు చేయించుకునే వారు సుమారుగా 30 నుంచి 50 మంది వస్తుంటారు. ఎంఆర్ఐ స్కానింగ్ చేయాలంటే పది నుంచి 15 రోజుల సమయం పడుతోందని రోగులు వాపోతున్నారు. రోగ నిర్ధారణ కాకుండా సరైన మందులు డాక్టర్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అన్ని రకాల స్కానింగ్‌లు అందుబాటులోకి తీసుకుని రావాలని కోరుతున్నారు. గర్భిణులకు చేసే టిఫా స్కానింగ్ అందుబాటులో లేదు. గర్భిణులకు 18-22 వారాల మధ్యలో బిడ్డ పరిస్థితి ఎట్లా ఉందో తెలుసుకునేందుకు టిఫా స్కానింగ్ చేస్తారు. ప్రస్తుతం గర్భిణీలు ఈ స్కానింగ్‌ను బయట చేయించుకుంటునాన్నరు. డాక్టర్లు అవుట్ పేషెంట్లను పరీక్షించే క్రమంలో ఇతరులు కూర్చునేందుకు అవసరైన బెంచీలు, కుర్చీలు లేకపోవడంతో అందరు నిలబడి ఉండాల్సి వస్తుంది. రోగుల కోసం వె యిటింగ్ హాలు నిర్మించినా అక్కడ బల్లలు సక్రమంగా లేవు. దోమలు అధికంగా ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్‌పి దంపతులు

శ్రీరామనవమి సందర్భంగా ఎస్‌పి దంపతులు పూజలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆదివారం శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఎస్‌పి కె.శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నవమి వేడుకలు పల్నాడు ఎస్‌పి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించు కున్నారు. నరస రావుపేట పట్టణంలో సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వేడుక ల్లో పాల్గొని స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. వేద పండితులు ఎస్‌పికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శివలింగరాజును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి

వైసిపి మండల అధ్యక్షులుగా కొండ శివలింగరాజు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

మాచర్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా కొండ శివలింగరాజును ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియమించారు.ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శివలింగరాజు బాధ్యతలు తీసుకున్నారు. పిన్నెల్లి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులకు ఇప్పుడు అందుబాటులో ఉండి సేవలందిం చాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ఆశయం సాధనలో అందరం భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, జెడ్పిటిసి మాజీ సభ్యుడు బొమిరెడ్డి సుబ్బారెడ్డి, బూడిద సైదులు, బోయ వీరరెడ్డి, పుట్టాబ్రహ్మయ్య, జూకూరి వెంకట రామయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బాసటగా కె.ఎన్.ఆర్ విద్యా సంస్థలు

ఉచితంగా ఎంసెట్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ:-పేద విద్యార్థులకు బాసటగా ఉన్నత విద్యను అందించేందుకు కె.ఎన్.ఆర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా ఎంసెట్ శిక్షణా తరగతులు నిర్వహిస్తునట్లు పిఎస్ఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలి పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంసెట్ శిక్షణ పొందాలంటే విద్యా ర్థులు రూ. లక్షలు వెచ్చించాల్సి వస్తుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రతి ఏడాదిఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులు నిర్వ హిస్తున్నామని తెలిపారు. 25ఏళ్ల అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 24వ తేది నుండి కొండమోడులోని పిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో తరగతులు ప్రారం భిస్తున్నామని వివరాలకు 9866249110, 9030562102, 7013665010 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రబీ పంటలపై రైతుల ఆశలు

డెల్టాలో ప్రారంభమైన నూర్పిళ్లు

ప్రజాశక్తి - దుగ్గిరాల

డెల్టా ప్రాంతంలో ప్రధాన రబీ పంటలైన మొక్కజొన్న జన్న పెసలు మినుములు నూర్పిడిలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్‌లో ధాన్యం ధరలు తగ్గి నష్టపోయిన రైతులు రబీ మీద పుట్టెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ సంవత్సరం రబీలో జొన్న ఎకరాకు 25 క్వింటాళ్లు, మొక్కజొన్న 35 క్వింటాళ్ల వరకు దిగుమతి వస్తుండగా మినుము కూడా ఆశించిన మేర ఎకరాకు 6 నుండి 8 బస్తాలు దిగుబడి వస్తోంది. అయితే పెసర పంటపై వాతావరణ ప్రభావం తీవ్రంగా ఉండటంతో దిగుబడి తీవ్రంగా తగ్గింది. ఎకరాకు మూడున్నర నుండి 5 బస్తాల వరకే దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. మండల వ్యాప్తంగా పెసర మినుము సాగు నామ మాత్రమే. 21 వేల ఎకరాల మాగాణి భూములలో పెనుమూలి, కేఆర్ కొండూరు ప్రాంతాలలో 2000 ఎకరాలలో మాత్రమే

డెల్టా ప్రాంతంలో ముమ్మరంగా సాగుతున్న రబి కోతలు

పెసర మినుము సాగు చేయబడుతుంది. మిగతా 19 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయబడుతుంది. ప్రస్తుతం జొన్న క్వింటా రూ.1950, మొక్కజొన్న రూ.2100, పెసర రూ.7000 మినుములు రూ.7200 పలుకుతున్నాయి. పంట నిల్వ చేస్తే ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారస్తులు తెలిపారు. గత సంవత్సరం మొక్కజొన్న రూ.2960 ఆల్ టైం గరిష్ట ధర పలికినది. అయితే డెల్టా ప్రాంతంలో ఎక్కువ భాగం కౌలు రైతులే ఉన్నారు. అప్పు చేసి వ్యవసాయం చేస్తుంటారు అందువలన ఎక్కువ మంది రైతులు పంట నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. వ్యాపారస్తులు నిలువ చేసి లాభాలు పొందుతారు. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబిలో రైతులకు ఊరట లభించింది.

పేదలకు నేడు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పేదలకు శాశ్వత ఇంటి పట్టాలును మంత్రి నారా లోకేష్ సోమవారం ఉదయం 9 గంటల నుండి మంగళగిరి మండలం ఎర్రబాలెం డాన్ బాస్కో స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో పంపిణీ చేయనున్నారు. అందులో భాగంగా ఉదయం కొలనుకొండ గ్రామానికి చెందిన - 231, పద్మశాలి బజార్ - 127, మధ్యాహ్నం పెనుమాక - 179, ఉండవల్లి - 77, ఇప్పటం -10 మొత్తంగా 624 మంది లబ్దిదారులకు ఏప్రిల్ 7 న శాశ్వత ఇంటి పట్టాలు నారా లోకేష్ అందజేస్తారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

మంత్రి మనోహర్‌కు జనసేన అధినేత శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం జనసేన పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం వర్తమానం పంపినట్లు తెనాలి కార్యాలయం ఓఎస్డీ తెలిపారు. బాధ్యతల నిర్వహణలో ఎంతో ఓర్పుగా, నేర్పుగా వ్యవహరించే అనుభవజ్ఞులు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మరెన్నో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. గతపాలకులు ప్రజా పంపిణి వ్యవస్థను పక్కదారి పట్టిస్తే, పిడిఎస్ మాఫియాపై మంత్రి మనోహర్ కఠినంగా వ్యవహరించడం తనకిచ్చిన భాధ్యతపై చిత్తశుద్ధి తెలుస్తుంతుందన్నారు. రైతుల దగ్గర ధాన్యం సేకరించి 48 గంటల్లోపే వారికి సొమ్ము చెల్లించేవిధంగా లక్ష్యం పెట్టుకున్నారు. ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరించి రైతులకు మేలు చేశారు. బియ్యం, కందిపప్పు, వంట నూనె లాంటి నిత్యావసరాల ధరలు అదుపులోకి తీసుకురావడం, దీపం-2 పథకం అమలు మహిళలకు సంతోషాన్ని కలిగించింది. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పార్టీ శ్రేణులను, నాయకులను అనుసంధానపరుస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్లడంలో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటి ఛైర్మన్ గా ఆయన నిర్వర్తించిన పాత్ర మరచిపోలేనిదన్నారు.

చలివేంద్రం ప్రారంభం..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మన్నె వారి బజార్ గౌతమ్ బుద్ధ రోడ్డు వద్ద వేసవిని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ మన్నెం అరుణ దంపతులు, ఎస్వీఆర్ ఫ్రెండ్ సర్కిల్, మన్నెం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని మన్నెం దంపతులు ప్రారంభించారు. తొలి రోజు శ్రీరామనవమి పర్వదినం కావడంతో మంచినీటితోపాటు పానకం పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు మన్నెం శ్రీనివాసరావు మాట్లాడారు. ఐదు సంవత్సరాల నుంచి ప్రతి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, ఆ క్రమంలోనే ఈ ఏడాది కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలం అంతా చలివేంద్రం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశం

చలివేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి సీనియర్ నాయకులు ఎం. శ్రీనివాసరావు దంపతులు

నాయకులు ఆలూరు ఉమామహేశ్వరరావు, పోతినేని వెంకటేశ్వరరావు, రాయన శ్రీనివాసరావు, పుట్టగుంట సురేష్, ఆలూరి బ్రహ్మయ్య, కాకర్ల నాగేశ్వరరావు మన్నెం సాంబశివరావు, శ్రీనివాసరావు, బిట్రా శివ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రాములోరి కళ్యాణం

ప్రజాశక్తి - మంగళగిరి

భార్గవ్ పేటలో జరిగిన సీతారాముల కళ్యాణం మహోత్సవం..

మంగళగిరి మన్నె వారి బజార్ గౌతమ్ బుద్ధ రోడ్డు వద్ద వేసవిని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ మన్నెం అరుణ దంపతులు, ఎస్వీఆర్ ఫ్రెండ్ సర్కిల్, మన్నెం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని మన్నెం దంపతులు ప్రారంభించారు. తొలి రోజు శ్రీరామనవమి పర్వదినం కావడంతో మంచినీటితోపాటు పానకం పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు మన్నెం శ్రీనివాసరావు మాట్లాడారు. ఐదు సంవత్సరాల నుంచి ప్రతి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, ఆ క్రమంలోనే ఈ ఏడాది కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలం అంతా చలివేంద్రం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు ఆలూరు ఉమామహేశ్వరరావు, పోతినేని వెంకటేశ్వరరావు, రాయన శ్రీనివాసరావు, పుట్టగుంట సురేష్, ఆలూరి బ్రహ్మయ్య, కాకర్ల నాగేశ్వరరావు మన్నెం సాంబశివరావు, శ్రీనివాసరావు, బిట్రా శివ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో టిటి యార్డు కార్మికుడు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన వడ్డేశ్వరం సుబ్బారావు (59) శనివారం సాయంత్రం గుండె సంబంధమైన వ్యాధితో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుబ్బారావు తండ్రి వడ్డేశ్వరం బిక్షాలు సిపిఎం సభ్యుడుగాను, గ్రామ సర్పంచి గాను గ్రామంలో సేవలందించారు. బిక్షాలుకు నలుగురు కొడుకులలో పెద్ద కుమారుడు అయిన సుబ్బారావు అనారోగ్యం తో మృతి

సుబ్బారావు మృత దేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు, మృతి చెందిన వడ్డేశ్వరం సుబ్బారావు (ఫైల్ ఫోటో)

చెందారు. 30 సంవత్సరాలకు పై బడి టి టి యార్డ్ లో పని చేసాడు. ఆదివారం అయన మృతి వార్త తెలుసుకుని వివిధ పార్టీలకు చెందిన నాయకులు సుబ్బారావు మఅతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, టి డి పి గ్రామ అధ్యక్షులు ఈపూరు బాబు, టి డి పి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధు సూధనరావు, టి టి యార్డ్ మేస్త్రి కోట్ల శ్రీనివాసరావు, గోపిశెట్టి శ్రీనివాస రావు, ఆనంద్, శ్రీను, సుబ్బారావు, డేవిడ్, మేరీ బాబు, సాంబయ్య, సుబ్బారావు కుమారులు అబ్రహం, పండు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుని వినూత్న ప్రచారం

ప్రజాశక్తి-దుగ్గిరాల

మైకు ద్వారా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్పించమని చుండూరు మండలం వేటపాలెం గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా అందరికీ విద్య అందరికీ బాధ్యత అనే ప్రచారంలో భాగంగా ఆదివారం దుగ్గిరాలలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలలో అర్హత గల ఉపాధ్యాయులు ఉంటారని అమ్మకు వందనం లాంటి ప్రభుత్వ పథకాలు స్కాలర్షిప్లు అందుతాయని మధ్యాహ్నం భోజన పథకం అమలు జరుగుతుందని తమ ద్విచక్ర వాహనానికి మైకు పెట్టి ప్రచారం సాగిస్తున్నారు. బాపట్ల తెనాలి గుంటూరు డివిజన్లో మార్చి 15 న ప్రారంభించాడని జూన్ 15వ తేదీ వరకు ఈ ప్రచారం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల్లో పూజా కార్యక్రమాలలో పాల్గన్నారు. స్థానిక మున్సిపల్ మార్కెట్ కూడలిలో దొంగరాముడు గుడిలో సీతారాములవారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అలాగే బోస్ రోడ్ లోని సీతారాముల ఆలయంలో సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గన్నారు. పండుగను పురస్కరించుకొని ఆలయాలలో ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు, కల్యాణ మహెూత్సవాలు విశేషంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. పలు దేవాలయాలలో పానకం వడపప్పు తో పాటు అన్నదానం కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ఎనిమిదో అంతస్తు నుండి పడి ఒకరు మృతి

ప్రజాశక్తి- తాడేపల్లి

స్థానిక పాతూరు రోడ్డులోని అపర్ణ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న పాటిబండ్ల సదాశివరావు (54) ఆదివారం టెర్రస్‌మీద నుండి కిందకు పడిపోయి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుళ్లూరు మండలం వెంకటపాలెంకు చెందిన పాటిబండ్ల సదాశివరావు అపర్ణగేటెడ్ అపార్టుమెంట్‌లో ప్లాట్ కొనుక్కుని భార్యతో ఉంటున్నారు. ఆయనకు బిపి, కళ్లు తిరగడం లాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ప్రతి రోజూ ఆపార్టుమెంట్ టెర్రస్ పైన వ్యాయామాలు చేస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం వాకింగ్, జాగింగ్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తు పై నుండి కిందకు పడిపోయారని తెలిపారు. గమనించిన వెంటనే సదాశివరావును 104 ద్వారా ఎయిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్ట్‌మార్టం అనంతరం సదాశివరావు భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మఅతుడికి భార్య ఇద్దరు పిల్లలు, కుమారుడు అమెరికాలో ఉంటారు. కుమార్తె తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది.

నేటి నుండి గుంటూరు జాబ్‌మేళాకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-గుంటూరు

స్మార్ట్‌టెక్స్, జిఎంసి ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న గుంటూరు మెగా జాబ్‌మేళాకు నేటి నుండి నగరంలోని వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉద్యోగాల కల్పనకు షుమారు 50 కంపెనీలతో త్వరలో గుంటూరు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నామన్నారు. ఐటి, నాన్ఐటి, బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగాల కల్పనకు, ఈనెల 9న విజ్ఞాన మందిరంలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వర్క్‌షాప్ జరుగుతుందన్నారు.కావున నగరంలో ఆసక్తి కల్గిన నిరుద్యోగ యువత వార్డు సచివాలయాలలో రిజిస్టేషన్ చేసుకోవాలని కోరారు.

దంత సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం దంత సమస్యలు, వాటి సంరక్షణ అనే అంశంపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సభలో ప్రముఖ దంత వైద్యులు టి.హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మన ఆరోగ్యం విషయంలో దంతాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని, కావున వాటి సంరక్షణ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ఉంటే అనేక ఇతర అనారోగ్య సమస్యల నుండి దూరంగా ఉండవచ్చు అన్నారు.దంతాలు ఆరోగ్యంగా లేకపోయినా, తీసుకున్న ఆహారం సరిగా నమలలేక పోయినా గ్యాస్‌ట్రబుల్, మలబద్ధకం లాంటి సమస్యలు ఎదురవుతాయి అన్నారు. దంతాలను కనీసం ఆరు నెలలకు ఒకసారి శుభ్రం చేయించుకోవాలని, నెలకు ఒకసారి బ్రష్‌ను మార్చాలని, వాడే బ్రష్ అల్ట్రా సాఫ్ట్ అయితే మంచిదని తెలిపారు. సరైన కారణం లేకుండా మౌత్ వాష్‌లను వాడితే మనకు ఉపయోగపడే మంచి బ్యాక్టీరియా కూడా నశించి దుష్పరిణామాలకు దారి తీస్తుందని తెలిపారు. కొత్త పళ్ళను పెట్టించే సందర్భంలో ముఖ్యంగా మూడు రకాల పద్ధతులు ఉన్నాయని. మొదటి పద్ధతిలో పన్ను తీసి మళ్ళీ పెట్టుకోగలిగే విధంగా ఉంటుందన్నారు. రెండోది ఏ పన్ను అయితే సమస్యకు గురౌతుందో దాన్ని తీసి దానికి ముందు వెనక ఉన్న పళ్ళను ఆధారంగా చేసుకుని కొత్తగా పళ్ళు వేయడం బ్రిడ్జి విధానం అని, ఇక మూడవది అధునాతన పద్ధతైన ఇంప్లాంట్స్ అని అన్నారు. ఇంప్లాంట్స్ రకరకాలుగా ఉంటాయని ఏ రకమైన ఇంప్లాంట్స్ వేయాలనేది ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు నిర్ణయిస్తారని తెలిపారు. ఇంప్లాంట్స్ వేయించుకున్న వ్యక్తులు వారి మధుమేహం, రక్తపోటు స్థాయిలను సాధారణంగా ఉంచుకోవాలని, లేకపోతే ఇబ్బంది కలిగే పరిస్థితి ఉంటుందన్నారు. గుండె వ్యాధిగ్రస్తుల విషయంలో కార్డియాలజీ డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పాతరోజులలో షుగర్, ఆస్టియోపొరోసిస్, క్యాన్సర్ రోగులలో ఇంప్లాంట్స్ విధానాన్ని వాడేవారు కాదని, కానీ ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ కారణంగా వారికి కూడా పేషంట్ స్పెసిఫిక్ ఇన్‌ప్లాంట్స్ అనే విధానంలో ఇంప్లాంట్స్ వేస్తున్నామని చెప్పారు. ఇటీవల కాలంలో మెడికేటెడ్ పేస్టులను వైద్యుని సంప్రదించకుండా వాడుతున్నారని అది సరైన పద్ధతి కాదని తెలిపారు. ఎవరైనా ఆహారం తీసుకున్నప్పుడు పళ్ళ మధ్యలో ఏదైనా ఇరుక్కున్నట్లు గుర్తిస్తే, ఇంట్రా డెంటల్ బ్రష్‌లు, ఓరల్ ఇరిగేషన్ డివైసెస్ లాంటివి ఉపయోగించి తొలగించుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ హర్షవర్ధన్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. సభకు టి.వి.సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామచంద్రరావు, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె.చంద్రశేఖర రావు, వెంకటేశ్వరరావు ప్రసంగించారు.

బాలికల ఉన్నత విద్యకు కృషి : జిసిడిఒ

కెజిబివిల్లో 6 నుండి ఇంటర్ వరకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు, అనాథలు, తల్లిదండ్రులు వలసపోయిన వారి పిల్లలకు ఉన్నత విద్య అందించేందుకు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు నిరంతరం కృషి చేస్తూ బాసటగా నిలుస్తున్నాయని జిసిడిఒ డి.రేవతి అన్నారు. కెజిబివిల్లో సీట్ల భర్తీ మరింత పారదర్శకంగా ఉంటాయని అనాథ పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రజాశక్తితో మాట్లాడిన ఆమె కెజిబివి లలో వసతులు విద్యా బోధన ఆయా అంశాలకు సంబంధించి పలు వివరాలు వెల్లడించారు. కెజిబివిలలో చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు, వ్యాయామం, యోగా, క్రీడలు, వక్తృత్వం, సైన్స్ ప్రయోగాలలో శిక్షణ ఇస్తూ వారి ఉన్నత భవిష్యత్తుకు తోడ్పాటు నిస్తున్నాయని అన్నారు. ఉచిత వసతితో పాటు భోజనం, అత్యంత నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న కెజిబివిలలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలలో అర్హులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన, ఆరోగ్యకరమైన, పరిశుభ్రత కలిగిన పోషకాహారం ఉచిత పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, బూట్లు, వ్యక్తిగత పరిశుభ్రత కిట్, వైద్య సహాయం, పటిష్ట భద్రత, వ్యక్తిత్వ వికాస తరగతులు కెరీర్ అండ్ మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్, యోగా మరియు క్రీడలు, సైన్స్ ఫెయిర్లు, ప్రదర్శనలు, వృత్తి విద్య, ఆత్మరక్షణ శిక్షణలు ఇవ్వడం జరుగు తుంది.

డి.రేవతి, జిసిడిఒ

11 వరకు దరఖాస్తుల స్వీకరణ

2025-26 ఏడాదికి గానూ ఉమ్మడి జిల్లాలోని 24 కస్తూర్బాలో 2052 సీట్లను భర్తీ చేయనున్నారు. 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న ఒక్కో తరగతికి ఒక్కో కెజిబివి లో 40 మందికి గాను మిగిలిన సీట్లకు సంబంధించి ఏప్రిల్ 11వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

అర్హులు వీరే: అనాథలు, పాక్షిక అనాథలు, బడి బయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలి కలు అర్హులు. https:\apkgbv.apcf-ss.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారు. విద్యార్థులు ఆయా కెజిబివిలకు నిర్ణయించిన తేదీలలో హాజరై ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలి.

కావల్సిన ధ్రువీకరణ పత్రాలు

ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు, తల్లిదండ్రులు లేకపోతే మరణ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, బడి బయట పిల్లలు, ఆయా మండల సంబంధిత మండల విద్యా వనరుల అధికారి అందజేసిన ఓఎసిసి పత్రం తప్పనిసరిగా ఉండాలి.

తరగతులు, ఇంటర్ గ్రూపులు

ఖాళీల వివరాలు

పల్నాడు జిల్లాలోని 24 కెజిబివి లలో 2052 సీట్లు భర్తీ కానున్నాయి. ఇంటర్మీడియట్ పల్నాడు జిల్లా వ్యాప్తంగా 24 ఉన్న కెజిబివి లలో ఎంపిసి గ్రూపు - అచ్చంపేట, దాచేపల్లి, క్రోసూరు, మాచవరం, నాదెండ్ల, నకరికల్లు, బైపిసి గ్రూపు - బెల్లకొండ, బొల్లాపల్లి, దుర్గి, గురజాల, ముప్పాళ్ళ, నూజెండ్ల, రెంటచింతల, వెల్దుర్తి, సత్తెనపల్లి, సిఇసి గ్రూపు - చిలకలూరిపేట, కారంపూడి, పిడుగురాళ్ళ, రాజుపాలెం, రొంపిచర్ల, వినుకొండ, ఎంఇసి గ్రూపు - ఈపూరు, సిఎస్ఇ (ఒకేషనల్ కోర్సు) - మాచర్లలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత నిరుపేద కుటుంబాలు, అనాథ బాలికలు సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు తమకు దగ్గరలో ఉన్న కెజిబివిలలో సంప్రదించాలని జిసిడిఒ రేవతి కోరారు.

మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-గుంటూరు

కూటమి ప్రభుత్వం ఎన్ని కల్లో మహిళలకు ఇచ్చిన వాగ్ధా నాలు అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీని వాసకుమారి డిమాండ్ చేశారు. ఆది వారం బ్రాడీపేట లోని సంఘ కార్యాలయంలో జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.పద్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన వాగ్ధానాలపై తాత్సారం చేస్తుందన్నారు. ఉచిత గ్యాస్ సబ్సిడీ సక్రమంగా అమలు కావట్లేదన్నారు. దాదాపు పది నెలలు దాటినా ఇంత వరకూ అమ్మఒడి ఊసే లేదన్నారు. ఉచిత బస్ సేవలు అతీగతి లేదన్నారు. 18 ఏళ్ల నుండిన వారికి నెలకు రూ.1500ల హామీ కూడా నెరవేర్చలేదన్నారు.ఎంతోమంది సామాజిక పెన్షన్, ఒంటరి మహిళలు పెన్షన్ కోసం ఎదురు చూస్తూ ఉన్నారని, కొత్త పెన్షన్లు మంజూరు చేయట్లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని, పెరుగుతున్న ధరలతో మహిళలు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని అన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు పెరిగిపోయాయన్నారు. అధిక ధరలు, మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి, కె.పద్మ, ఎస్.కె.ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసకుమారి

పౌరసేవలు మెరుగుపరుస్తాం

- కార్పొరేషన్ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు
- కమాండ్ కంట్రోలు రూం నుంచి నిత్య పర్యవేక్షణ
- తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తాం
- ప్రజాశక్తితో కమిషనర్ పులి శ్రీనివాసులు

నగర పాలక సంస్థ ఆదాయం పెంపునకు కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇందుకోసం ఒక ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నామని తెలిపారు. నగరంలో ఖాళీగా ఉన్న నగరపాలక సంస్థ స్థలాల్లో బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాలు నిర్మించడం ద్వారా ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. పౌరసేవలు మెరుగుపర్చేందుకు యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కమాండ్ కంట్రోలు రూం ద్వారా పర్యవేక్షణ ఉంటుందని ఆయన వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

కమాండ్ కంట్రోలు రూం ద్వారా ఏమేమి పర్యవేక్షణ చేస్తారు?

నగరంలో ప్రజలకు అందించాల్సిన పౌరసేవలు, అప్పటి కప్పుడు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వీలుగా త్వరలో కమాండ్ కంట్రోలు రూంను ఏర్పాటు చేయనున్నాం. నగరంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను, అనధికార కట్టడాలను, తాగు నీటి సరఫరా పైపు లైన్ల లీకులను, పార్కులు, డివైడర్లు, జంక్షన్లు, వీధి దీపాలు, నగర పాలక సంస్థ నిర్మిస్తున్న రోడ్లు, డ్రైన్లు, నగర పాలక సంస్థ వాహనాలను క్షేత్ర స్థాయిలో తనిఖీకి కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ, పరిశీలన ఉంటుంది. సమస్యలను గుర్తించిన వెంటనే సత్వర పరిష్కారం కొరకు నేరుగా చర్యలు తీసుకొనుటకు కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ జరుగుతుంది. ప్రతి 350 ఇళ్లకు ఇద్దరు శానిటరీ వర్కర్లు ఉంటారు. వారు నిత్యం ఆ ఇంటి వద్ద చెత్త సేకరించిన తరువాత స్కాన్ చేస్తే కమాండ్ కంట్రోలు రూమ్‌కు సమాచారం వస్తుంది.

యాప్ ద్వారా సేవలు?

ప్రజలకు కార్పొరేషన్ యాప్ ద్వారా పౌరసేవలను విస్తృత పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే వివిధ స్థాయిలో అధికారులు, ఉద్యోగులతో ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ సమీక్షలకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. కార్పొరేషన్‌లో పరిపాలన పరంగా తీసుకోవాల్సిన చర్యలు, సమీక్షలకు యాప్ ద్వారా తనకు అన్ని స్థాయిల నుంచి సమాచారం వస్తుందని, తద్వారా వెంటనే పరిష్కారం కోసం కృషి చేస్తాం.

ఫుడ్ కోర్టు ఏర్పాటుపై నిర్ణయం?

గుంటూరు నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఫుడ్‌జోన్ ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతాల్లో స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాలు, సూచనలు తీసుకొని త్వరలో ఒక ప్రాంతాన్ని నిర్ణయిస్తాం. ఇప్పటికే అరండల్ పేట 4వ లైన్, పిచ్చుకల్ గుంట, బ్రాడీపేట 4వ లైను ప్రాంతాలు పరిశీలనలో ఉన్నాయి. రాత్రి వేళ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుండో ప్రజలు కోరుతున్నారని అందుకు అనుగుణంగా అనుకూల మైన ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి పలు ప్రాంతాలను పరిశీ లిస్తున్నాం.

ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ?

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల థీం క్రింద ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు చేస్తాం. ఏప్రిల్ 1వ తారీఖు నుండి సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలును పక్కాగా అమలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగించుట వలన పర్యావరణానికే కాక ప్రజల ఆరోగ్య సమస్యలకు కారణంగా నిలుస్తోంది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించాలి. సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు పై నగర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తయిందా?

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం నుండి పౌర సేవలతో పాటుగా సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు వార్డ్ సచివాలయాల కుటుంబాల (హౌస్ హోల్డ్) మ్యాపింగ్ పూర్తయింది. ప్రభుత్వ సేవలు, ప్రయోజనాలు పొందాలంటే హౌస్ హోల్డ్ లేదా ఆర్టీజిఎస్ డేటా బేస్‌లో కుటుంబ వివరాలు నమోదు తప్పని సరి. ఆయా పథకాల అమలు, వినతుల పరిష్కార సమయంలో కుటుంబ జాబితాలోని వివరాలు సరిగా ఉంటేనే వాటి పరిష్కారం సులువు అవుతుందన్నారు. ఈ మ్యాపింగ్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే వారే కాకుండా ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రజలు కూడా తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికీ ఎవరైనా చేసుకోని వారు ఉంటే సంబంధిత సచివాలయాల్లో సంప్రదించాలి.

తాగునీటి సమస్యలపై చర్యలు?

ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే లీకేజీలన్నీ పూర్తిగా మరమ్మతులు చేశాం. ఎక్కడయినా లీకేజిలు వచ్చిన ఒక్క రోజులో పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. నగరంలో అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

ఖాళీ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు?

నగర పాలక సంస్థకు ఆదాయం పెంపునకు పిపిపి పద్ధతిలో బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాలు నిర్మాణంకు ఆలోచన చేస్తున్నాం. మానస సరోవరం స్థలంలో ఆహ్లాదకరమైన ఎమ్యూజ్‌మెంట్ పార్కు తరహాలో పిపిపి పద్ధతిలో ప్రజలకు ఒక పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉంది. అలాగే పివికె నాయుడు మార్కెట్, ఆరండల్‌పేటలో ఉన్న ఖాళీ స్థలాలు, బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న స్థలాలు, పాత డిసి ఆఫీసు, సర్కిల్ ఆఫీసు తదితర ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మాణం చేయాలన్న ఆలోచన ఉంది. ప్రభుత్వంతో చర్చించి కౌన్సిల్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి